క్లుప్తంగా

6 నుంచి ఐటీఐ కౌన్సెలింగ్

గుడివాడ టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కోర్సులలో చేరే విద్యార్థులకు ఈ నెల 6వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని స్థానిక కేబీఆర్ గవర్నమెంట్ ప్రిన్సిపాల్ ఎల్. గౌరీమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 10 జీపీఏ నుంచి 5.5 జీపీఏ వరకు, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు 5.4 జీపీఏ నుంచి 1.5 జీపీఏ కలిగిన అభ్యర్థులకు మొదటి విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు వచ్చేవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె కోరారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డులు



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారు అవార్డుల పంట పండించారు. ఈ విషయాన్ని ఆ క్లబ్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ సోమవారం విలేకరులకు తెలిపారు. లయన్స్ రీజియన్ మీట్‌లో ఉత్తమ లయన్స్ క్లబ్‌గా, ఉత్తమ చైర్మన్‌గా, ఉత్తమ సెక్రటరీ, ఉత్తమ ట్రెజరర్ తదితర అవార్డులను సాధించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం



గుడివాడ టౌన్: శ్రీ నిర్వికల్పానంద భారతి స్వామి ఆరాధనోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దనియాల పేటలోని ప్రణవాశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతి స్థైర్యానంద సరస్వతి వారి చేతుల మీదుగా స్వామి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో ప్రణవాశ్రమ మేనేజర్ ఆర్. వేణుబాబు, భక్తులు ఆర్. శివప్రసాద్, ఎస్. శ్రీనివాస్, ఎస్. శేషగిరిరావు, డీఆర్‌బి ప్రసాదు, పి. సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో సోమవారం పేదలకు అన్నదానం చేశారు. గుడ్లవల్లేరు హోమియోపతి వైద్యశాల డాక్టర్ బి.నాగేంద్రరావు, లక్ష్మీ రమణకుమారి దంపతుల పెళ్లిరోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు.

మాజీ ఎంపీపీ ధనుంజయ మృతి



ధనుంజయ (ఫైల్)

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మాజీ ఎంపీపీ కొగంటి ధనుంజయ (61) మృతి చెందారు. గుడివాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో సోమవారం సాయంత్రం ఆయన గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం ఉదయం వారి స్వగ్రామం కూచికాయలపూడిలో నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

యువకులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

గుడివాడరూరల్: ఇటీవల తెనాలిలో గంజాయి మత్తులో పోలీసులపై దాడి చేశారనే ఆరోపిస్తూ దళిత, మైనార్టీ యువకులపై పాశవికంగా నడిరోడ్డుపై దాడి చేసి కొట్టిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏబీసీసీ జాతీయ అధ్యక్షుడు జాన్‌బెన్నీ లింగం డిమాండ్ చేశారు. గుడివాడ ఏబీసీసీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెనాలికి చెందిన దళిత, మైనార్టీ యువకులు జాన్‌విక్టర్, రాకేష్, కరీముల్లా గంజాయి మత్తులో కానిస్టేబుల్ చిరంజీవిపై దాడి చేశారని, ముగ్గురు యువకులను ప్రజలందరూ చూస్తుండగా నడిరోడ్డుపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీలతో కొట్టడం అప్రజాస్వామ్యకమన్నారు. ఈ విషయమై తక్షణమే ప్రభుత్వం స్పందించి యువకులపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

గూడూరు: లేళ్లగరువు పంచాయతీ శివారు యాదవ లేళ్లగరువులో మాడుగుల అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకుంభం వారి ఇలవేల్పు అయిన మాడుగుల అంకమ్మ తల్లి ఆలయాన్ని గ్రామంలో నిర్మించారు. సోమవారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ శ్రీనివాసరావు, నాగబాబుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పారిశుద్ధ్యం పాతర

- అటకెక్కిన చెత్త సేకరణ
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



ఎస్సీ కాలనీలో మురుగునీటితో అస్తవ్యస్తంగా ఉన్న అంతర్గత రోడ్డు

గుడివాడరూరల్: మండలంలో మేజర్ పంచాయతీ పోలుకొండ గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. గ్రామంలో అంతర్గత రోడ్లు చిన్నపాటి వర్షాలకు ముంపునకు గురై బురదమయంగా మారుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో రోడ్లపై మురుగు నీరు రోజుల తరబడి నిలిచిపోతోంది. దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో పెద్ద గ్రామమైన పోలుకొండకు నాగభూషణపురం శివారు గ్రామంగా ఉంది. గ్రామంలో రైస్ మిల్లులతో పాటు ఊర చెరువులు ఉండటంతో ఆదాయం సమృద్ధిగానే ఉంది. అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అనే చందాన పంచాయతీ పరిస్థితి రోజురోజుకీ తీసికట్టుగా మారుతోంది.

ఎక్కడ చూసినా మురుగే..

గ్రామంలో ఏ వీధి చూసినా మురుగు నీరుతో కన్పిస్తున్నాయి. ముఖ్యంగా జీపీకే రోడ్డు నుంచి ఎస్సీ శ్మశాన వాటిక వరకు ఉన్న సీసీ రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. దాదాపుగా రెండు దశాబ్దాల క్రితం నిర్మించి సీసీ రోడ్డు కృంగిపోయింది. రోడ్డుకి ఇరువైపులా మురుగు నీరు ప్రవహించే అవకాశం లేక చిన్నపాటి వర్షాలకు రోడ్డు ముంపునకు గురవుతోంది. మురుగు నీరు బయటకు వెళ్లే సదుపాయం లేకపోవడంతో రోజుల తరబడి రోడ్లపైనే నీరు నిల్వ ఉండి దోమలు, ఈగలకు ఆవాసంగా మారుతోంది. పెద్ద రోడ్డు నుంచి నాగభూషణపురం వెళ్లే రోడ్డు వరకు ఉన్న సీసీ రోడ్డును గ్రామంలో ఉన్న కొందరు ఆక్రమించి పశువుల దొడ్డిగా మార్చేశారు. కనీసం మనుషులు నడవటానికి సైతం వీల్లేకుండా పశువులను రోడ్లపైనే కట్టేయడంతో రోడ్డుపై వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. జీపీకే రోడ్డు నుంచి హిందూ శ్మశాన వాటిక వరకు ఉన్న రోడ్డు పరిస్థితి ఇంతే సంగతి.



పోలుకొండ గ్రంథాలయం వద్ద రోడ్డు పక్కనే పడేసిన చెత్త



చెత్తతో నిలిచిపోయిన చెత్త సేకరణ బండి

సమస్యలు పరిష్కరించండి

గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ దారుణంగా మారింది. చిన్నపాటి వర్షాలు వచ్చినా రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. సైడ్ డ్రెయిన్లు లేవు. మురుగు నీరు వెళ్లే అవకాశం లేదు. మురుగు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో దోమలు ఇబ్బందులు పెడుతున్నాయి. సమస్యలు పరిష్కరించాలని నాయకులు, అధికారులకు తెలిపినా పట్టించుకున్న వారే లేరు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యలను పరిష్కరించాలి.

– వంశీ, పోలుకొండ గ్రామస్తుడు

చెత్త సేకరణ గాలికే..

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో గ్రామాల్లో చెత్త సేకరణ అంటూ హడావుడి చేసిన పంచాయతీ అధికారులు రోజుల గడుస్తున్న కొద్దీ ఆ పనిని గాలికి వదిలేశారు. ప్రస్తుతం గ్రామంలో చెత్త సేకరణ నిలిచిపోయింది.

పారిశుద్ధ్య చర్యలు శూన్యం

చిన్నపాటి వర్షాలకు వీధులు మురుగునీటితో నిండిపోవడం, దోమలు, ఈగలు విజృంభిస్తున్నా వాటి నిర్మూలనకు పంచాయతీ అధికారులు, సిబ్బంది ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. కనీసం గ్రామ వీధుల్లో క్లోరినేషన్ చేసిన దాఖలాలు లేవు. మంచినీటి చెరువు నీరు కలుషితమవ్వడంతో ఆర్వో ప్లాంట్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. పేదలు కలుషితమైన నీటినే తాగి అంటు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

పేర్ని నానిని కలిసిన ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు



పామర్రు: వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా పామర్రు-3 ఎంపీటీసీ సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావును గతంలో నియమించారు. ఈ నేపథ్యంలో ఆయన కృష్ణా జిల్లా వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పేర్ని వెంకట్రామయ్య(నాని)ని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానికంగా ఉన్న పార్టీ విషయాలను ఇన్‌చార్జితో చర్చించినట్లు ఆయన తెలిపారు. ఆయనతోపాటు పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు ఉన్నారు.

నేడు తాడంకిలో వికసిత కృషి సంకల్ప అభియాన్

పమిడిముక్కల: మండలంలోని తాడంకిలో చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేవీకే సమన్వయ కర్త డి.సుధారాణి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సాగులో సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాల సమాచారాన్ని శాస్త్రవేత్తల బృందం ద్వారా గ్రామాలకు చేరి అందించే విధంగా వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు.

'వెన్నుపోటు దినం' పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: కూటమి ప్రభుత్వ పాలనలో ఓటు వేసిన ప్రతిఒక్కరికీ వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని స్వగృహంలో వెన్నుపోటు దినం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా స్థానిక ఎన్టీటీఎస్ హోమ్ ప్రాంగణం వద్ద నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మోసాలను ఖండిస్తూ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు 4వ తేదీ ఉదయం 10 గంటలకు ఎన్టీటీఎస్ హోమ్ వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు పాలేటి చంటి, జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి టి. యేషయ్య, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ కాసీం, రాష్ట్ర కార్యదర్శి షేక్ బాజి, రేమల్లి నీలాకాంత్, అద్దేపల్లి పురుషోత్తం, చుండూరి శేఖర్, రమణకుమార్, ఎ.కృష్ణమోహన్, జి. సురేష్, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

కైకలూరు: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులు సర్టిఫికెట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ ఎస్.శాంతి జ్యోతి సోమవారం తెలిపారు. పూర్తి విద్యార్హతలు కలిగిన అధ్యాపకులు కాలేజీలో అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. ఉచిత నోటు పుస్తకాలు, బ్యాగులు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు తరగతులు ప్రారంభించామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

'యోగాంధ్ర' విజయవంతానికి కృషి



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడి జిమ్ ప్రాంగణంలో ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్న యోగాంధ్ర-25 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మండల అధికారులు కృషి చేయాలని ఉయ్యూరు డివిజన్ ఆర్డీఓ బీఎస్‌హెలా షారోన్ పిలుపునిచ్చారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. నాట్యానికి నిలయమైన కూచిపూడిలో నిర్వహించే యోగాలో నాట్యానికి సంబంధించిన సింబాలిక్‌తో మానవహారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కళాపీఠం ప్రధానాచార్యులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, తహసీల్దార్ కే మస్తాన్, ఎంపీడీఓ జే విమాదేవి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్దనున్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ అగ్నిప్రమాదానికి దగ్ధమైనట్లు జిల్లా ఉప అగ్నిమాపక అధికారి ఆంజనేయులు సోమవారం తెలిపారు. సకాలంలో ఫైర్ సిబ్బంది స్పందించి మంటలు అదుపుచేశారని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో ఉన్న రావిచెట్టు ఎండుటాకులు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి ప్రమాదం సంభవించిందని పేర్కొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అనిల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కైలే అనిల్‌కుమార్

పామర్రు: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రజలను మోసం చేస్తూ వెన్నుపోటు పొడుస్తుంటే స్థానిక ఎమ్మెల్యే మట్టి, ఇసుక మాఫీయాతో ప్రభుత్వానికి రావాల్సిన రూ.100 కోట్లకు పైగా సొమ్మును పార్టీ నేతలకు దోచి పెడుతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కూటమి తీరుపై నిప్పులు చెరిగారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని చెరువుల్లోని మట్టిని కొల్లగొట్టడం, కృష్ణానదిలోని ఇసుకను మాయం చేస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన నగదును కూటమి నేతలే భోంచేస్తూ ప్రజలకు తీరని అన్యాం చేస్తున్నారన్నారు. ఇసుక ఫ్రీ అని ప్రచారం చేస్తున్న కూటమి ప్రభుత్వం నియోజకవర్గం నుంచి రోజుకు 500-600 చొప్పున ఇసుక లారీలను ఒక్కొక్క లారీ రూ.10 వేలు చొప్పున విక్రయించి తరలిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ హామీని ఏడాదిగా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రజలను వెన్ను పోటు పొడిచిన చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

అవినీతి మయం

కూటమి ప్రభుత్వం వచ్చిన రోజునే నిమ్మకూరులో మట్టి మాఫియా ప్రారంభించిందని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆరోపించారు. ప్రతి రోజూ నిమ్మకూరు, పసుమర్రు, కొండిపర్రు తదితర గ్రామాల్లో అడ్డగోలుగా మట్టి తవ్వకాలు జరిపి కూటమి నేతలు అక్రమార్జనకు పాల్పడుతున్నారన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మండలానికో షాడో ఎమ్మెల్యేను పెట్టి అక్రమార్జనకు తెగబడుతున్నారన్నారు. పామర్రులో సుమారు రూ.100 కోట్లతో బస్టాండ్ ఆధునీకరణ పనులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తే ఇది తామే చేశామని చెప్పుకుంటున్న కూటమి నేతలకు సిగ్గు లేదా అని ప్రశ్నించారు. పామర్రు పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేస్తే ఇదికూడా తామే చేశామని చెప్పుకోవడం కూటమి నేతలకు సిగ్గులేని తనం కాదా అన్నారు. ఏడాదిగా ప్రజలను వెన్ను పోటు పొడుస్తున్న కూటమి ప్రభుత్వ పాలనకు నిరసనగా ఈ నెల 4వ తేదీన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు 'వెన్ను పోటు దినం' నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీలు దాసరి అశోక్‌కుమార్, గోగం సురేష్, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, నాయకులు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, కాకర్ల వెంకటేశ్వరరావు, పెయ్యల రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మందపాడు కాలనీవాసులు

గుడివాడరూరల్: మందపాడు కాలనీలో సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆ కాలనీ వాసులు గుడివాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మందపాడు కాలనీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. తాగునీరు సమస్య అధికంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో స్థానిక రాము ఎమ్మెల్యేగా గెలిస్తే కాలనీలో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇది జరిగి ఏడాది కావస్తున్నా కాలనీలో ఎక్కడ సమస్యలు అక్కడే తిష్టవేసి ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం సాగిస్తామని కాలనీ వాసులు తెలిపారు.

ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు



ఆటపాక వద్ద పుల్లవ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు: భవిష్యత్తులో ముంపు సమస్యలు రాకుండా నియోజకవర్గంలో డ్రెయిన్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తున్నామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఆటపాక సమీపంలో పుల్లవ, వర్లకోడు డ్రెయిన్ల పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ రైతులు స్వచ్ఛందంగా రూ.40 లక్షలు సేకరించి నీటిలో గుర్రపుడెక్క, కిక్కిసను పొక్లయిన్‌తో తొలగించడానికి పంటు కొనుగోలు చేశారన్నారు. పుల్లవ డ్రెయిన్‌లో 12 అడుగల కిక్కిస పెరిగిందన్నారు. పూర్తి స్థాయిలో తొలగిస్తున్నామన్నారు. వార్లకోడు డ్రెయిన్ ఆక్రమణల కారణంగా నీరు కిందకు చేరక ఏటా కైకలూరు పట్టణంలో పలు వార్డులు నెలలు తరబడి నీటిలో నానుతున్నాయన్నారు. పొక్లయిన్‌తో మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ట్రావెలర్స్ బంగ్లా వద్ద బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొల్లేరులో పక్షులతో పాటు ప్రజలకు ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలిపారు. ఆటపాక గ్రామంలో డ్రెయిన్ల పరిశీలనకు వచ్చిన ఆయన మాట్లాడుతూ కొల్లేరు అంశాలపై తాడేపల్లిలో సీఎం సమీక్ష చేశారన్నారు. కొల్లేరు అభయారణ్యంలో 20,000 ఎకరాల డీ ఫాం, జి రాయితీ భూములను వదిలిపెట్టి మిగిలిన భాగంలో కొల్లేరును అభివృద్ధి చేసుకోవాలని సూచించామన్నారు.

ఆట పాటలతో వేసవి శిబిరాల్లో సందడి



గుడ్లవల్లేరులో చిన్నారులకు నృత్య పోటీలు



గుడివాడలో శిక్షణ ఇస్తున్న సెల్‌ఫోన్ నిపుణులు వెంకటేశ్వరరావు

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు నిర్వహించే నృత్య, ఆట పాటలతో సందడి నెలకొందని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు నృత్య, ఆటల పోటీలను నిర్వహించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు సోమవారం కూడా కొనసాగాయి. కార్యక్రమంలో భాగంగా సెల్‌ఫోన్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. సెల్‌పోన్ నిపుణులు కోనా వెంకటేశ్వరరావు సెల్‌ఫోన్ అధికంగా వాడటం వలన కలిగే నష్టాలు, పుస్తకాలు చదవడం వలన కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శాంతి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

జమీగొల్వేపల్లి(పామర్రు): మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా స్వర్ణాంధ్ర-2047 అనే అంశంపై విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు పద్మావతి, యోగా గురువు పొట్లూరి వెంకట ధర్మారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్వర్ణాంధ్ర లక్ష్యాలను తెలుసుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి నాగసురేష్ పాల్గొన్నారు.



మండవల్లిలో కంప్యూటర్ పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన

కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన

మండవల్లి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండవల్లి గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై సోమవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో అన్నీ కంప్యూటర్ పరిజ్ఞానంతో ముడిపడి ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ వేసవి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు.

అన్నదాతల సంక్షేమానికి కృషి



వల్లూరుపాలెంలో గుర్రపుడెక్క తొలగింపు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

తోట్లవల్లూరు: అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని వల్లూరుపాలెంలో ఏనుగులకోడు డ్రెయిన్‌లో రూ. 2.90 లక్షలతో చేపట్టిన గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపు పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏనుగులకోడులో గుర్రపుడెక్క తొలగింపు ద్వారా పంట పొలాలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రొయ్యూరు-వల్లూరుపాలెం మధ్య ఏనుగులకోడు డ్రెయిన్ గట్ల పటిష్టతకు రూ. 60 లక్షలతో అంచనాలు రూపొందించినట్లు పేర్కొన్నారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు కాట్రగడ్డ రవిబాబు, నాయకులు కోటిబాబు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో యోగా శిక్షణ తరగతులు



పమిడిముక్కల: స్థానిక సచివాలయంలో యోగాపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ట్రైనర్లు తిరుమల, స్రవంతి విద్యార్థులతో సోమవారం యోగాసనాల సాధన చేయించారు. ఎంపీడీఓ వీర్ల సీతారామరాజు, ఎంఈఓ శ్రీనివాస్, ఈఓఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరావు, కార్యదర్శి రమేష్ శిక్షణ తరగతులు పరిశీలించారు. మచిలీపట్నంలో జరిగే యోగాంధ్ర పోటీల్లో పాల్గొనేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని తిరుమలకు సూచించారు.

ముగిసిన యోగా శిక్షణ తరగతులు

మొవ్వ: స్థానిక మండవ జానకిరామయ్య సులోచన క్షేత్రయ్య కల్యాణ మండపంలో వారం రోజులపాటు సాగిన యోగా శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన గురువులు బోలెం వెంకటనాగశివ, పి.నాగబసవయ్య, మంతెన లీల మోహనవర్మను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మండల శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మండల శాఖ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరావు, వైస్ చైర్మన్, మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, లైఫ్ మెంబర్స్ కామేశ్వరరావు, వెంకటరమణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.